జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
శుక్రవారం | 21 | ఫిబ్రవరి | 2025 | పేజీలు : 4



# మహా కుంభమేళాలో ఎంపీ వద్దిరాజు

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి

రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర-విజయలక్ష్మీ దంపతులు మహా కుంభమేళ సందర్భంగా ప్రయాగరాజ్ వద్ద త్రివేణి సంగమంలో పుణ్యస్నానమాచరించారు. మహా కుంభమేళ 144 సంవత్సరాలకొకసారి జరుగుతుందన్న విషయం తెలిసిందే. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగరాజ్ (అలహాబాద్)వద్ద గంగా,యమున, సరస్వతి (అంతర్వాహిని)నదులు కలవడాన్ని త్రివేణి సంగమం అంటారు. మహా కుంభమేళ సందర్భంగా ఈ సంగమంలో స్నానం చేయడం



## విద్యార్థులు సమాజంలో గొప్ప స్థాయికి ఎదిగి ఇతరులకు

# తోడ్పాటు అందించాలి

- -జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- -బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకొని మన యొక్కసామర్థ్యం నిరూపించుకోవాలి
- -పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు సహకరిస్తున్న మలబార్ గోల్డ్ చారిటబుల్ సంస్థకు ప్రత్యేక అభినందనలు
- -విద్య ఆడపిల్లలకు అస్తిత్వం అందిస్తుంది
- ఏఎస్ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్




ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి

బాగా చదివి సమాజంలో గొప్ప స్థాయికి ఎదిగి, మరో నలుగురి ఎదుగుదలకు తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ స్థానిక శాంతినగర్ ఏఎస్ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు 47 మంది ప్రభుత్వ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు కోసం అవసరమైన శిక్షణ, పుస్తకాలు అందించేందుకు మలబార్ గోల్డ్ చారిటబుల్ సంస్థ వారు నగదు ప్రోత్సాహంగా 3 లక్షల 80 వేల రూపాయల చెక్కును జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు చాలా కష్టపడి పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారని, ఇందులో కొందరు ఆర్థికంగా స్థిరంగా ఉంటారని, కొందరు పేదరికం లో ఉంటారని, వారిని చూసి స్ఫూర్తి పొంది సమాజంలో అగ్రస్థాయికి చేరుకునేందుకు బాగా చదువుకోవాలని అన్నారు. మన పుట్టుక, కులం, మతం, ప్రాంతం, చుట్టూ పరిస్థితులు మిగతా 2 లో..



## రైతుల సమస్యలను ప్రాధాన్యతతో

# పరిష్కరిస్తాం



- -జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్
- -పెండింగ్ లో ఉన్న సరిహద్దు వివాదాల పరిష్కారానికి చర్యలు
- -అటవీ మంటల నియంత్రణకు రైతులు సహకరించాలి
- -ఉపాధి హామీ క్రింద పి.టి, ఫార్మ్ పాండ్ నిర్మాణానికి ప్రతిపాదన
- -సింగరేణి మండలం తొసీబుడు గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ గ్రామసభ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అటవీ అధికారి

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి

రైతుల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ తెలిపారు. గురువారం జిల్లా అటవీ అధికారి సింగరేణి మండలం తొసీబుడు గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అటవీ సంబంధిత సమస్యలు, అటవీ హక్కుల గుర్తింపు, రహదారి కనెక్టివిటీపై నిర్వహించిన బహిరంగ గ్రామసభ కార్యక్రమంలో పాల్గొన్నారు. అటవీ భూముల ఆక్రమణలకు సంబంధించి వివాదాలు, ఆందోళనలు, వ్యవసాయ క్షేత్రాలకు, మార్కెట్ కు మెరుగైన రోడ్డు కనెక్టివిటీ మిగతా 2 లో..

## నిబంధనలు పాటిస్తూ ఎమ్మెల్సీ పోలింగ్

# సజావుగా నిర్వహించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి పద్మశ్రీ
- 27న నిర్వహించు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి

ఈ నెల 27న చేపట్టే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ను నిబంధనలు పాటిస్తూ సజావుగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఏ. పద్మశ్రీ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గురువారం సెక్టార్ అధికారులు, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, మైక్రో అబ్జర్వర్లు, ఓపీఓ లకు పోలింగ్ నిర్వహణపై శిక్షణ కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న డిఆర్ఓ. పద్మశ్రీ మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమాన్ని మిగతా 2 లో..



విద్యార్థులు సమాజంలో గొప్ప స్థాయికి ఎదిగి ఇతరులకు

# తోడ్పాటు అందించాలి

మన చేతిలో ఉండవని, అందుబాటులో ఉన్న విద్యను మనం వినియోగించుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. చదువు వల్ల సమాజంలో మనకు గౌరవం లభిస్తుందని, ముఖ్యంగా ఆడపిల్లలకు విద్య అస్తిత్వం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. పూర్వీకులకు దొరకని అవకాశం మనకు లభించిందని, మనకు అందిన ఈ అవకాశం ఎట్టి పరిస్థితుల్లోనూ చేజార్చుకోవద్దని అన్నారు. మనం ఇతరుల కంటే ఎప్పుడు ఒక అడుగు ముందు ఉండాలని అన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత మరో నలుగురికి సహాయం చేసి వారి ఎదుగుదలకు తోడ్పాటు అందించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల విద్యకు ఇబ్బందులు కలగకుండా, సమాజంలో గొప్ప స్థాయికి ఎదిగి ఇతరులకు తోడ్పాటు అందించాలనే మంచి సంకల్పంతో మలబార్ గోల్డ్ సంస్థ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే 47 మంది విద్యార్థులకు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అవసరమైన 3 లక్షల 80 వేల రూపాయలను అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. మలబార్ సంస్థ సొంత ప్రాంతమైన కాలికట్ నుంచే తన భార్య కూడా వచ్చిందని , ఇతరులకు సహాయం చేయాలనే ఆలోచనతో అదే విధంగా మనమంతా ఇతరులతో కలిసి ఎదగాలని, ఎవరిని చిన్న చూపు చూడవద్దని కలెక్టర్ పిల్లలకు సూచించారు. మనం ఎదిగే క్రమంలో అనేక మంది నిరుత్సాహపరుస్తారని, దొరికిన దానితో సంతృప్తి చెందమని సలహాలు అందిస్తారని, మనం నిర్దేశించుకున్న లక్ష్యం దిశగా ప్రణాళిక ప్రకారం క్రమపద్ధతిలో పనిచేస్తూ వెళ్లాలని ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని విద్యార్థులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట తీసుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సహాయం చేసేందుకు ముందుకు వచ్చిన మలబార్ గోల్డ్ సంస్థ ప్రతినిధులకు కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు, అధ్యాపకులు పవన్, భరత్ కుమార్, రాణి, శ్రీనివాస్, కిరణ్, మలబార్ సంస్థ జిల్లా హెడ్ విష్ణు, మేనేజర్ రామారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరిస్తాం

ఆవశ్యకత, ఆహారం, నీటి కోసం వ్యవసాయ భూముల వైపు వస్తున్న వన్య ప్రాణులకు సంబంధించిన సమస్యలు, కోతుల బెడదపై రైతులు సమస్యలను లేవనెత్తారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ, అడవుల్లో మంటలు చెలరేగడం, అటవీ ప్రాంతంలో పండ్ల చెట్లు తగ్గిపోవడంతో కోతులు వ్యవసాయ భూమి వైపు వస్తున్నాయని, రైతుల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని తెలిపారు. పెండింగ్ లో ఉన్న సరిహద్దు వివాదాలను, రోడ్డు కనెక్టివిటీ మెరుగుపరిచేందుకు సంబంధిత శాఖల సమావేశంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కందకం తవ్వి అటవీ, ఆర్.ఓ.ఎఫ్.ఆర్. భూములకు స్పష్టంగా సరిహద్దు ఏర్పాటు చేస్తామని, వన్య ప్రాణులను అడవికి పరిమితం చేసేందుకు పండ్ల చెట్లను, గచ్చకాయను నాటడం జరుగుతుందని, ట్రెంచ్ ఎస్ఎంసి కొలతగా కూడా పని చేస్తుందని అన్నారు. ఉపాధి హామీ క్రింద పి.టి, ఫార్మ్ పాండ్ నిర్మాణానికి ప్రతిపాదించాలని, అటవీ మంటలను ఆపడానికి సమాచార నెట్వర్క్ నిర్మిస్తున్నామని, దీనికి రైతులు సహకరించాలని జిల్లా అటవీ అధికారి కోరారు. టి.జి.ఎఫ్.డి.సి. నిధుల క్రింద మొబైల్ హాస్పిటల్ ప్రతిపాదిస్తున్నామని ఆయన తెలిపారు. అడవిలో మైదాన ప్రాంతంలో మంకీ కోర్ట్ ప్లాంటేషన్ చేస్తామని, రైతులకు సౌర శక్తితో నడిచే బోర్ వెల్ లను అందించడానికి ఐటిడిఏ మద్దతు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశం ద్వారా ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకోవడానికి, అటవీ అధికారులపై స్థానిక సమాజం నమ్మకం పెంచుకోవడానికి వీలు కల్పించిందని, రైతుల జీవనోపాధికి భరోసా నిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించడానికి రైతులు తమ సహకారం అందించాలని జిల్లా అటవీ అధికారి కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్డివో మంజుల, అటవీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటిస్తూ ఎమ్మెల్సీ పోలింగ్ సజావుగా నిర్వహించాలి

పూర్తిగా సద్వినియోగం చేసుకొని ఎన్నికలు నిర్వహించుటకు సమాయత్తం కావాలని, ఎన్నికల విధుల పట్ల ఏవైనా సందేహాలు ఉంటే శిక్షణలో నివృత్తి చేసుకోవాలని, ఎన్నికల నిర్వహణ లో ప్రతి ఒక్కరికి అనుభవం ఉందని, గత అనుభవాలు ఉన్నప్పటికీ హ్యాండ్ బుక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ మరొకసారి నూతనంగా చదవాలని, మనకు మొత్తం తెలుసు అనుకొని నిర్లక్ష్యం వహిస్తే తప్పులు జరుగుతాయని అన్నారు. మాస్టర్ ట్రైనర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ఎన్. మాధవిలు పోలింగ్ నిర్వహణపై, బ్యాలెట్ బాక్స్ లను ఓపెన్ చేయడం, క్లోజ్ చేయడం, సీల్ చేసే పద్ధతులపై అవగాహన కల్పించారు. పోలింగ్ నాడు ఉదయం 7-30 గంటలకు ఖాళీగా ఉన్న బ్యాలెట్ బాక్స్ ను ఏజెంట్లకు చూపించి, గ్రీన్ పేపర్ లో ఏజెంట్ల సంతకాలు తీసుకుని సీల్ చేసి, బ్యాలెట్ బాక్స్ పై పోలింగ్ కేంద్రం వివరాలు కనపడే విధంగా పేపర్ అతికించాలని సూచించారు. పోలింగ్ కు ఒక రోజు ముందు డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వచ్చి పోలింగ్ డ్యూటీ అలాట్మెంట్ ఆర్డర్ తో పాటు సంబంధిత పోలింగ్ కేంద్రం సిబ్బందితో కలిసి చెక్ లిస్ట్ ప్రకారం ఒకటికి రెండుసార్లు సరి చూసుకుని పోలింగ్ సామాగ్రి తీసుకొని వెళ్ళాలని సూచించారు. ఓటర్ సీక్రెసీ కాపాడేందుకు వీలుగా ఓటింగ్ కంపార్ట్మెంట్ ను ఏర్పాటు చేయాలని, సాయంత్రం నాలుగు గంటల వరకు లైన్ లో ఉన్న ఓటర్ లకు స్లిప్పులు ఇచ్చి ప్రతి ఒక్కరికి ఓటు వేసే అవకాశం కల్పించాలని, చివరి ఓటర్ ఓటు వినియోగించుకున్న తర్వాత నిబంధనల ప్రకారం బ్యాలెట్ బాక్సులను మూసివేసి సీల్ చేయాలని, పోలింగ్ నాడు ప్రతి రెండు గంటలకు, పోలింగ్ ముగిసిన తరువాత పోలింగ్ జరిగిన వివరాల రిపోర్ట్ పంపాలని అన్నారు. బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్స్ ల ప్రిపరేషన్, స్టాట్యూటరీ, అన్ స్టాట్యూటరీ సామాగ్రి, ఎన్నికల సంబంధ నివేదికల పూరింపు, డైరీల నమోదు లపై అధికారులకు అవగాహన కల్పించారు. బ్యాలెట్ బాక్స్ సీలింగ్ పై హ్యాండ్ ఆన్ శిక్షణ ఇచ్చారు.

ఈ శిక్షణా కార్యక్రమంలోఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వరి పంట పొలాలను పరిశీలించిన మండల వ్యవసాయ శాఖ అధికారి. రామడుగు వాణి

**కూసుమంచి ఫిబ్రవరి 20 ప్రజా జ్యోతి**

కూసుమంచి మండలం లోని ఈశ్వరమాదారం గ్రామంలో వరి పొలాలను కూసుమంచి మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వరి ఈనే దశలో ఉందని , అక్కడక్కడా అగ్గి తెగులు , కాండం తొలిచే పురుగును గమనించడం జరిగిందని తెలిపారు.కాండం తొలిచే పురుగు అంకురం నుండి చిరుపొట్ట దశలో ఆశిస్తే, ఈనే దశలో గింజలకు పోషక పదార్థాలు అందక, గింజలన్నీ తాలు గింజలుగా మారి తెల్ల కంకులు ఏర్పడతాయి. ఆలస్యంగా లేదా ముదురు నారు నాటడం ,కరువు పరిస్థితులు తక్కువ రాత్రి ఉష్ణోగ్రతలుసూర్యరశ్మి రోజుకు 7 గంటల కంటే తక్కువనత్రజనికి సంబంధించిన ఎరువులను మోతాదుకు మించి వాడటం ఈ పురుగు ఉధృతికి అనుకూలమైన పరిస్థితులు. ముఖ్యంగా యాసంగి వరి పైరులో, ఈ పురుగు ఎక్కువగా ఆశించే అవకాశముంటుంది. చదరపు మీటరుకు ఒక తల్లి పురుగు లేదా గ్రుడ్ల సముదాయం లేదా 10 శాతం చచ్చిన మొవ్వులు లేదా లింగాకర్షక బుట్టలలో వారానికి బుట్టకు 25-30 మగ రెక్కల పురుగులు గమనించినప్పుడు మాత్రమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.ఉధృతిని బట్టి, సస్యరక్షణ మందులైన క్వినాల్ ఫాస్ 2 మి.లీ లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ లేదా ఎసిఫేట్ 75 ఎస్.పి 1.5 గ్రా.



లేదా క్లోరంట్రానిలిప్రోల్ 18.5 ఎస్.సి 0.3 మి.లీ లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి 2 గ్రా. లేదా టెట్రానిలిప్రోల్ 0.5 మి.లీ లీటరు నీటికి కలిపి మందులను మారుస్తూ పిచికారి చేయాలి. వరిలో అగ్గితెగులు గమనించినట్లయితే ట్రైసైక్లోజోల్ మందును పిచికారి చేయాలని తెలిపారు. అనంతరం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజనలో భాగంగా ఫిజికల్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని గమనించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సౌమ్య రైతులు పాల్గొన్నారు.

# మహా కుంభమేళాలో ఎంపీ వద్దిరాజు

పరమ పవిత్రమైనదని,పూర్వజన్మ సుకృతమని భావిస్తారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర-విజయలక్ష్మీ దంపతులు గురువారం భక్తి ప్రపత్తులతో పుణ్య స్నానమాచరించి గంగమ్మ తల్లికి పసుపు, కుంకుమ సమర్పించారు.

## విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో టోల్ ఫ్రీ నెంబర్

**సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఏ సురేందర్**

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

విద్యుత్ వినియోగదారులకు 24/7 అందుబాటులో ఉండి మరింత మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడం లో భాగంగా ఎటువంటి విద్యుత్ సమస్య తలెత్తిన 1912 టోల్ ఫ్రీనంబర్ కు సంప్రదించాలని ఏ. సురేందర్, ఖమ్మం సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ కోరారు. విద్యుత్ సరఫరాలో తలెత్తే ఇబ్బందులు అంటే ట్రాన్స్ఫార్మర్ల ఫేయిల్యూర్లు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ , లోవోల్టేజి , బ్రేక్ డౌన్స్, , ప్రమాదభరింతగా ఉన్న స్థంబాలు , వైర్లు తదితరవి . విద్యుత్ బిల్లుల సమస్యలు అంటే పేరు మార్పు , బిల్లులలో తేడాలు, బిల్లులో ఏమైనా హెచ్చుతగ్గులు ఉన్న ,విద్యుత్ మీటర్లలో సమస్యలు, అనగా, ఆగిపోయిన మీటర్లు, పోయిన మీటర్లు, విద్యుత్ సర్వీసుల సమస్యలు అనగా, నూతన సర్వీసు మంజూరు ,సర్వీస్ క్యాన్సలేషన్ అన్ని రకాల విద్యుత్ సేవలో ఉన్నటువంటి సమస్యలు. మొదలగు అన్ని రకాల విద్యుత్ సమస్యల కొరకు టోల్ ఫ్రీ నంబర్ 1912 సంప్రదించి సేవలు పొందగలరని కోరారు . ప్రతి ఒక్క వినియోగదారుడు గుర్తుపెట్టుకునేలా టోల్ ఫ్రీ నంబర్ 1912 ను విస్తృతంగా ప్రచారం చేపడుతున్నామని చెప్పారు . సాంకేతికతను జోడించి సత్వర ఫిర్యాదుల పరిష్కారం చేస్తున్నామని చెప్పారు .కార్పొరేట్ కార్యాలయంలో 1912 కు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని , నిరంతరం ఉన్నత అధికారుల పర్యవేక్షణ జరుగుతుందని , 1912 కు వచ్చిన ఫిర్యాదులను సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు . తద్వారా త్వరిత గతిన సమస్యలు పరిష్కారం అవుతాయాని వివరించారు .

## అవకాశవాద, మతోన్మాద,డబ్బు రాజకీయాలను తిప్పి కొట్టాలి

**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్**

**తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 20, ప్రజా జ్యోతి :**

అవకాశవాద, మతోన్మాద, డబ్బు రాజకీయాలను తిప్పి కొట్టి ప్రజల కోసం పనిచేసే రాజకీయ పార్టీలను ప్రజలు ఎన్నుకోవాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్. స్థానిక గజ్జల వెంకటయ్య భవనంలో సిపిఎం మండల నాయకులు పద్మనాభుల సుధాకర్ అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బండి రమేష్ మాట్లాడుతూ అధికారం కోసం ప్రజలను మభ్యపెట్టి అవకాశవాద డబ్బు రాజకీయాలు చేస్తున్నారని, ఇలాంటి అవకాశవాద రాజకీయాలు ఎన్ని రోజులు నడవవు అని, ప్రజలు చైతన్యవంతులని కచ్చితంగా ప్రజల సమస్యలపై పోరాటాలు చేసే పార్టీలవైపు వస్తారని ఆయన అన్నారు. ఆ విధంగా ప్రజలు చైతన్యవంతం చేసేదాంట్లో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు ముందు ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మండల ఇన్చార్జి షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ భవిష్యత్తు కమ్యూనిస్టులదే అని ప్రజలు నివురు కప్పిన నిప్పు కొండలని, అన్ని గమనిస్తూ ఉంటారని ప్రజా చైతన్య వచ్చినప్పుడు ఏ శక్తి వారిని ఆపలేదని ఆయన అన్నారు. ప్రపంచ దేశ రాజకీయాలు గమనిస్తే మనకు అర్థమవుతుందని ఆయన అన్నారు. అనేక దేశాల్లో కమ్యూనిస్టుల విలువ వస్తుందని, పోరాటాల వైపుకు ప్రజల ఆకర్షిత అవుతున్నారని అని గుర్తు చేశారు. దేశంలో కూడా ఎక్కువ రోజులు మతోన్మాద రాజకీయాలు సాగవు అని, ప్రజలు కచ్చితంగా మార్పులు కోరుకుంటారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొమ్ము శ్రీను, మండల నాయకులు దాసరి మహేందర్, బింగి రమేష్ తుళ్లూరు నాగేశ్వరరావు, కొత్తపల్లి వెంకన్న, షేక్ పతే హా మహ్ దిండు మంగపతి, కోడి లింగయ్య, వాసయ్య, లింగస్వామి, వసపొంగు వీరన్న, సైదులు, రెడ్డి, రాములు, కొమ్ము నాగేశ్వరరావు పాల్గొన్నారు.



# బోర్డు పీకివేత పై అధికారుల ఆగ్రహం

## స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు.





**కారేపల్లి,ఫిబ్రవరి 20,ప్రజా జ్యోతి:**

బీసీ హాస్టల్ కు కేటాయించిన స్థలంలో అక్రమ కట్టడాలు చేపట్టిన వారిపై స్థానిక పోలీస్ స్టేషన్లో,మండల తాసిల్దార్ కు ఫిర్యాదు చేశామని,దీంతోపాటు బీసీ వెల్ఫేర్ కమిషనర్ కు సైతం ఫిర్యాదు చేశామని ఖమ్మం అసిస్టెంట్ బిసి డెవలప్మెంట్ ఆఫీసర్ ఎం.ఈదయ్య తెలిపారు.గురువారం సింగరేణి మండల కేంద్రం కారేపల్లి గ్రామంలో బీసీ హాస్టల్ స్థలాన్ని జిల్లా అధికారులు పరిశీలించారు.పీకి వేసిన హాస్టల్ బోర్డును స్వయంగా అధికారులు గోతి తీసి కాంక్రీట్తో యధా స్థానంలో పాతారు.అనంతరం ఈదయ్య మాట్లాడుతూ సింగరేణి మండలంలోని కారేపల్లి గ్రామంలో ప్రభుత్వం బీసీ బాలుర హాస్టల్ కొరకు గత రెండు సంవత్సరాల క్రితం ఎమ్మార్వో ఆర్డీవో ఎంక్వైరీ చేసి ఇట్టి స్థలాన్ని బీసీ హాస్టల్కు కేటాయించారన్నారు. దాని పూర్తి డాక్యుమెంటేషన్ పూర్తికాగానే గవర్నమెంట్ కు అప్పీలు చేయడంతో దాంట్లో మూడు కోట్ల రూపాయలతో బిల్డింగ్ కట్టడానికి అమౌంట్ శాంక్షన్ అయ్యాయన్నారు.తదుపరి వర్క్ ఆర్డర్ కొరకు వేచి చూస్తున్నట్లు తెలిపారు.ఇలాంటి పరిస్థితుల్లో బీసీ హాస్టల్ స్థలంలో మండల తాసిల్దార్ అనుమతి లేకుండా కట్టడాలు నిర్మించి, ప్రభుత్వ స్థలంలోని(బిసి హాస్టల్) బోర్డుని పీకి వేయడం,అట్టి స్థలంలో అక్రమ కట్టడాలు నిర్మించడం తమ దృష్టికి వచ్చిందని అన్నారు.హాస్టల్ బోర్డును పీకివేయడంతోపాటు,అక్రమ నిర్మాణాలు చేపట్టడం చట్టరీత్యా నేరమని అన్నారు.దీనికి సంబంధించిన విషయమై మండల తాసిల్దార్ తో పాటుగా,స్థానిక పోలీస్ స్టేషన్లో అధికారులు ఫిర్యాదు చేశారు. సంఘటనకు సంబంధించిన సమగ్ర విషయాన్ని పై అధికారులైన బీసీ కమిషనర్ కు సైతం ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు.బీసీ హాస్టల్ స్థలానికి సంబంధించిన హద్దుల చుట్టూ ఈనెల 27వ తారీఖున ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని అన్నారు.ఈ మండలంలో పేద విద్యార్థులైన అందరికీ ఉపయోగపడే విధంగా హాస్టల్లు నిర్మించి వారి భావితరాలకు ఉపయోగపడాలనే గ్రామస్తుల సంకల్పం గొప్పదని అన్నారు.దీనికి తోడు తమ ప్రభుత్వ భూమిని ఆక్రమణలకు గురికాకుండా కంటికి రెప్పలా కాపాడుతున్న గ్రామస్తుల సహకారం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అసిస్టెంట్ బీసీ డెవలప్మెంట్ ఆఫీసర్ డి నరసయ్య,హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ వేణు,జూనియర్ అసిస్టెంట్ డి భాస్కర్ తో పాటు గ్రామస్తులుతదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు

### మాదకద్రవ్యాలతో యువత జీవితాలు నాశనంచేసుకోవద్దు

### సీఐ ఉస్మాన్ షరీఫ్




**రఘునాథపాలెం ప్రజా జ్యోతి**

భారతదేశ భవిష్యత్తు యువత పైన ఉందని యువత మాదకద్రవ్యాలు, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, మాదక ద్రవ్యాల దుర్వినియోగం లేని సమాజ స్థాపనకు కృషి చేయాలని నార్కోటిక్స్ ఇన్స్పెక్టర్ శ్రీ వి విజయరాంకుమార్ గారు మరియు రఘునాథపాలెం సి ఐ మహమ్మద్ ఉస్మాన్ షరీఫ్ సంయుక్తంగా పిలుపునిచ్చారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్ (%చీ×ూణ%). సౌజన్యంతో నెహ్రూ యువ కేంద్ర ఖమ్మం ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ (%చీవీదీూ%) కార్యక్రమంలో భాగంగా రఘునాథపాలెం బీసీ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన సమావేశం నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథులచే జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించబడింది. ఈ కార్యక్రమానికి నెహ్రూ యువ కేంద్ర జిల్లా ప్రోగ్రాం అధికారి కమరతపు భానుచందర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐ ఉస్మాన్ షరీఫ్ గారు మాట్లాడుతూ భారతదేశంలో డ్రగ్ దుర్వినియోగం ఒక పెరుగుతున్న సమస్యగా మారిందనీ, ఇది వ్యక్తులకే కాకుండా కుటుంబాలు మరియు సమాజాన్ని కూడా ప్రభావితం చేస్తుందనీ, యువత ముఖ్యంగా డ్రగ్స్ వాడటం వలన తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కుంటూ, మానసిక స్థిరత్వం కోల్పోవడమే కాకుండా, నేరాల పెరుగుదలకు కూడా కారణమవుతున్నారని చెప్పారు. వీటికి దూరంగా ఉన్నప్పుడే మంచి పౌరులుగా ఎదుగుతారని పిలుపునిచ్చారు.నార్కోటిక్స్ ఇన్స్పెక్టర్ విజయ రామ్ కుమార్ గారు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో యువత ఎక్కువగా గంజాయి మత్తులో పడి జీవితాలను పాడు చేసుకుంటున్నారని, క్షణిక ఆనందం కోసం నిండు జీవితాన్ని బలి చేసుకోవద్దని, ఒకసారి అలవాటైతే అది వ్యసనంగా మారుతుందని మత్తుకు బానిసలు కావద్దని యువతకు సూచించారు మరియు పిపిటి ప్రెజెంటేషన్ తో యువత కి మాదక ద్రవ్యాలు తీసుకుంటే యువత మరియు విద్యార్థుల జీవితంలో ఎలాంటి అనర్థాలు జరుగుతాయో వివరించడం జరిగింది. తమ చుట్టూ పక్కల ఎవ్వరైనా మాదక ద్రవ్యాలు సేవిస్తూ కనిపిస్తే డైల్ 100 నెంబర్ మరియు హెల్ప్ లైన్ నంబర్ 1908 కి తెల్పవల్సిందిగా యువత ను కోరారు. గంజాయిని ఎవరైనా సరఫరా చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కఠినంగా హెచ్చరించారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరణ చేసి కార్యక్రమం లో పాల్గొన్న యువతతో అధికారులు మత్తు పదార్థాలు వాడమని ప్రతిజ్ఞ చేపించారు.

ఈ కార్యక్రమానికి సహకరించినందుకు కళాశాల ప్రిన్సిపల్ శ్రీ వెంకటేశ్వర రావు గారికి మరియు కళాశాల యాజమాన్యానికి నెహ్రూ యువ కేంద్ర కృతజ్ఞతలు తెలిపింది.

## కారేపల్లి రైల్వే స్టేషన్ లో రిజర్వేషన్ కౌంటర్ పున: ప్రారంభించబడింది.

**ఇందుర్తి సురేందర్ రెడ్డి.**



కారేపల్లి, ఫిబ్రవరి 20 ,ప్రజా జ్యోతి: కారేపల్లి రైల్వే స్టేషన్లో రిజర్వేషన్ కౌంటర్ పునః ప్రారంభించబడింది మండల పరిధిలోని ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోగలరని సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కౌంటర్ లో రిజర్వే టికెట్స్,రోజువారి టికెట్స్, తత్కాల్ టికెట్స్ కొనుగోలు చేయగలరు.లేకపోతే ఆదాయం తక్కువగా ఉందని మనమందరం, ప్రజాప్రతినిధులు, అధికారుల సమిష్టి కృషితో ఎంతో కష్టపడి సాధించిన మన రిజర్వేషన్ కౌంటర్ ను మళ్లీ రద్దు చేసే ప్రమాదం ఉంది. కాబట్టి ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి ఎక్కువ శాతం కౌంటర్ లోనే టికెట్స్ బుక్ చేసుకోగలరని కోరుతున్నానని ఆయన పేర్కొన్నారు.

## ఖమ్మంలో చల్లపల్లి రాధమ్మ మెమోరియల్ జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు

**ఫిబ్రవరి 22నుండి మార్చి1 వరకూ పోటీలు**

**ముఖ్య అతిథులుగా రానున్న జిల్లా ఉన్నతాధికారులు**

**చీఫ్ రిఫరీగా రానున్న ప్రవీణ్ నాయక్**



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

ఖమ్మం గుమ్మంలో మొట్టమొదటిసారిగా జాతిస్తాయి టెన్నిస్ క్రీడా పోటీలకు రంగం సిద్ధమైంది. ఫిబ్రవరి 22వ తారీకు నుంచి మార్చి ఒకటి వరకు జరగనున్న నేషనల్ టెన్నిస్ పోటీల్లో భాగంగా చల్లపల్లి రాధమ్మ మెమోరియల్ జాతిస్తాయి టెన్నిస్ పోటీలకు ఖమ్మం వేదికైంది. ఈ మేరకు ఖమ్మం జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చల్లపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అనిల్ కాసినేని, ట్రెజరర్ కాంపాటి సత్యనారాయణ, జిల్లా స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి తుంబూరు సునీల్ రెడ్డి తదితరులు ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈనెల 22వ తేదీన ప్రారంభం కానున్న టెన్నిస్ పోటీలు మార్చి 1వ తేదీ వరకు జరుగుతాయని వారు తెలిపారు. నగదు బహుమతిగా విజేతకు రెండున్నర లక్షల ప్రైజ్ మనీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జాతీయ స్థాయిలో 145 ఎంట్రీలు వచ్చాయని వారు తెలిపారు. క్రీడాకారులకు అన్ని రకాల వసతులు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరి తెలిపారు.

## డిజిటల్ పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు. సరిత



**కూసుమంచి ఫిబ్రవరి 20 ప్రజా జ్యోతి**

కూసుమంచి మండలంలోని జీళ్ళచెరువు గ్రామంలో డిజిటల్ పంట నమోదు కార్యక్రమాన్ని కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సరిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిజిటల్ పంటను మొదటి కార్యక్రమాన్ని పొరపాట్లు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఏఈఓలకు సూచించారు. అనంతరం రైతులకు పామాయిల్ పంటపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రవీందర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**తిరుమలయపాలెం, ఫిబ్రవరి 20, ప్రజా జ్యోతి :**

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని తిరుమలాయపాలెం యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిమట్ల వెంకట్ అన్నారు. పిండిప్రోలు గ్రామంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు . కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని అన్ని రంగాలలో ప్రగతి విప్లవం కొనసాగుతోందని, గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని ఆయన తెలిపారు, పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ కృషితో పిండిప్రోలు గ్రామంలో గతంలో ఎన్నడూ లేని విధంగా పిండిప్రోలు గ్రామం నుండి స్మశాన వాటికకు వెళ్లేందుకు 20 లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్డు పనులు ప్రారంభించారు ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు దొడ్డ గురవయ్య, షేక్ జానీ, షేక్ సలీం, నజీర్, రషీద్, జైల, మహబూబ్ పాషా, నాగులు మీరా, పంజా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## తోటి ఫోటోగ్రాఫర్ మిత్రుడికి ఆర్థిక సాయం

### 43.వేల రూపాయలు అందజేత.



**రఘునాధపాలెం ప్రజా జ్యోతి**

తోటి ఫోటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సహాయం ఖమ్మం నగరం లో గల జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అనారోగ్యంతో కొన్ని రోజుల నుండి బాధపడుతున్న తోటి ఫోటోగ్రాఫర్ కోలా రామారావు కు ఆర్థిక సాయం అందజేసిన తోటి ఫోటోగ్రాఫర్ సుమారు 43 వేల రూపాయలు ఆరోగ్య ఖర్చులు నిమిత్తమై ఖమ్మం టౌన్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అందరూ కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మరగాని వెంకట్,మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్స్ మిత్రులు. లకు ఎటువంటి ఇబ్బందులు కలిగిన యూనియన్ అండగా ఉంటుందని. సభ్యుల సహకారంతో సహాయ సహకార అందిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిరుడు తిరుపతిరావు, కమటం రఘు, కె ఎస్ బాబా, రంజిత్, లాస్య అంజి, తోటి ఫోటోగ్రాఫర్ మిత్రులు పాల్గొన్నారు

## భర్త చేతిలో భార్య మృతి.

### నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.



**కారేపల్లి,ఫిబ్రవరి 20,ప్రజా జ్యోతి:** క్షణికావేశంలో భర్త చేయి చేసుకోవడంతో భార్య మృతి చెందిన సంఘటన సింగరేణి మండల పరిధిలోని జైత్రం తండా శివారులో గురువారం చోటుచేసుకుంది.దీనికి సంబంధించి ఎస్ఐ ఎన్. రాజారామ్ తెలిపిన వివరాల ప్రకారం జైత్రం తండా శివారులో మిర్చి ఏరడానికి వచ్చిన దంపతులు (వలస కూలీలు) భర్త కమలేష్ భార్య పింకీ మరావి సుమారు ఉదయం 5 గంటల ప్రాంతంలో గొడవ పడడంతో భార్య పింకీని భర్త బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు.సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని,దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

## రాష్ట్రస్థాయి కేలో ఇండియా ఉషూ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన పోడకంటి పవిత్ర చారి.

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

తెలంగాణ రాష్ట్ర స్థాయి ఉషు పోటీలు అదిలాబాద్ జిల్లా ఇందిరా ప్రియదర్శిని ఇండోర్ స్టేడియం నందు జరిగిన కేలో ఇండియా ఉమెన్స్ లీగ్ సీనియర్ విభాగంలో ఖమ్మం జిల్లాకు చెందిన పోడకంటి పవిత్ర చారి మొదటి బహుమతి గోల్డ్ మెడల్ సాధించినది అని కోచ్ పి పరిపూర్ణాచారి తెలిపారు పోడకండి పవిత్ర చారి నాన్- దావో ఈవెంట్ లో గోల్డ్ మెడల్ సాధించిన పవిత్ర చారి ఇండియా జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్రం తరపున అర్హత సాధించడం జరిగింది గోల్డ్ మెడల్ సాధించిన పవిత్ర చారిని జిల్లా యుజన మరియు క్రీడల అధికారి టి సునీల్ కుమార్ రెడ్డి, ఉషూ జాతీయస్థాయి కోచ్ పరిపూర్ణ చారి అభినందనలు తెలిపారు.



# కనీస వసతులు లేక ఏకలవ్యలలో అవస్థలు.

### విద్యాలయంకు నాసిరకం వస్తువుల సరఫరా.
### అరకొర వసతులతో నేరవేరని లక్ష్యం.
### ఏకలవ్య స్కూల్ సందర్శనలో గిరిజన సంఘం నాయకులు.



**కారేపల్లి, ఫిబ్రవరి 20, ప్రజా జ్యోతి:**

గిరి పుత్రులను అన్ని రంగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏకలవ్య మోడల్ స్కూల్ లో కనీస వసతులు కరువై విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తెలంగాణ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం విమర్శించారు. గురువారం సింగరేణి మండలం రేలకాయలపల్లి లో ఏర్పాటు చేసిన ఏకలవ్య మోడల్ స్కూల్‌ను గిరిజన సంఘం నాయకులు సందర్శించారు. విద్యార్థుల మెనూ, విద్యార్థులకు ఇచ్చిన క్రీడాసామాగ్రి, దుస్తులు,మంచాలను వారు పరిశీలించారు. తరగతిగదులు, వసతి గృహాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన విద్యాలయంను 15 ఎకరాలలో ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం 9 ఎకరాలలో నిర్మించారన్నారు. ఏకలవ్య లక్ష్యం ఆటలు, చదువు అని దానికి తగిన ఆట స్థలం లేక ప్రభుత్వ ఉద్దేశం నిరుపయోగంగా మారిందన్నారు. మారుమూల ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఏకలవ్యలో వైద్య సేవలు దరిదాపులో అందుబాటులో లేవన్నారు. ఏకలవ్య స్కూల్ కేంద్రంగా వైద్యుడుని, అంబులెన్స్ వాహనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఏడాదికి రెండు జతలు దుస్తులు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటికి ఇవ్వలేదని, ఇచ్చిన షూస్ నాసిరకంగా ఉన్నాయని తమ పరిశీలనలో తేలిందన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకూ నాసిరకం వస్తువులు సరఫరా జరుగుతుందని, ఆహార పదార్థాల సరఫరా లో నాణ్యత లేదన్నారు. విద్యార్థులు ఉండే గదులలో ఫ్యాన్లు, లైట్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. ఏకలవ్య స్కూల్ పరిశీలనలో వచ్చిన అంశాలను ప్రిన్సిపాల్ తన్నీరు నాగేశ్వరావు తో గిరిజన సంఘనాయకులు చర్చించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఏకలవ్య మోడల్ స్కూల్ ను జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు సందర్శించి ఏకలవ్య మోడల్ స్కూల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.లేని పక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం మండల అధ్యక్షులు అజ్మీర శోభన్‌నాయక్, నాయకులు ధారావత్ వినోద్‌నాయక్, రణదేవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 23న జరిగే కె.వి.పి.ఎస్ పాలేరు డివిజన్ సదస్సును జయప్రదం చేయండి.

### కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు పాపిట్ల సత్యనారాయణ




**కూసుమంచి పిబ్రవరి20 ప్రజా జ్యోతి**

ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఎస్సీ ,ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలు సాధనకై ఫిబ్రవరి 23న కెవిపిఎస్ పాలేరు డివిజన్ సదస్సును జయప్రదం చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు పాపిట్ల సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో కెవిపిఎస్ డివిజన్ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ గ్రామాలలో విస్తృత ప్రచార ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ పాలేరు డివిజన్లో 215 దళితువాడలు ఉన్నాయని, రాజ్యాంగం ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తయిన ఇప్పటివరకు ఆ వాడల్లో ప్రజలకు సరైన సౌకర్యాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కెవిపిఎస్ సంఘం ఏర్పడిన నాటినుండి నేటి వరకు దళిత వర్గాల ప్రజల హక్కులకై వారికి అండగా అనేక పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు.కెవిపిఎస్ పోరాటాల ఫలితంగానే జస్టిస్ పున్నయ్య కమిషన్, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం, ప్రతి దళిత వాడకు రెండు ఎకరాల స్మశాన వాటిక స్థలం జీవో నెంబర్ 1 2 3 5 సాధించటం జరిగిందని తెలిపారు .భవిష్యత్తులో పాలేరు నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఎస్సీ కమిటీ హాల్ పూర్తి చేయాలని, కుల వివక్షత రూపుమాపాలని, నియోజకవర్గంలో మొత్తం దళితవాడలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అర్హులైన ప్రతి ఒక్కరికి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ ఖమ్మం రూరల్ మండల ఉపాధ్యక్షులు మిరియాల సారయ్య, కూసుమంచి మండల కేవిపిఎస్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు గోపి జానకి రాములు, మామిడాల ఉపేందర్, గోపి వెంకన్న, కొండ వేణు, మునగాల నవీన్, రాములు, నాగేశ్వరరావు, లక్ష్మయ్య, రమేష్, పాల్గొన్నారు.

## చింతకాని మండలం వందనం గ్రామ రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి**



తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం వందనం గ్రామంలో రైతు సంఘంమహాసభ నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ఆవుల మంగయ్య అధ్యక్షత వహించారు ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కోశాధికారి కూచిపూడి రవి మాట్లాడుతూ రైతుకి పంటకు కనీస గిట్టుబాటు ధర ఇవ్వాలని మిర్చికి నా బార్డ్ ఏర్పాటు చేసి ప్రభుత్వం ఏ ఖరీదు చేయాలని వడ్లకు బోనస్ చెల్లించకుండా ప్రభుత్వం తాచారం చేస్తుందని తక్షణమేచెల్లించాలని సుబాబుల్ రైతులను ఆదుకోవాలని ఎటువంటి కొర్రీలు పెట్టకుండా తక్షణమే రుణమాఫీ చేయాలని సాగు చేసే వారందరికీ రైతుబంధు ఇవ్వాలని రైతులకు ఎరువులను తక్కువ ధరలకే ఇవ్వాలని కల్తీ విత్తనాలపై ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ రంగంపై ఆధారపడిన 60 శాతం రంగాన్ని ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ ప్రవేశపెట్టేటప్పుడు ఎక్కువ నిధులను కేటాయించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేయడం జరిగినది ఈ సమావేశం అనంతరం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం గ్రామఅధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగినది అధ్యక్షుడిగా ఆవుల హరీష్ ప్రధాన కార్యదర్శిగా ఆవుల పిచ్చయ్య కార్యవర్గ సభ్యులుగా రాచ బంటి శ్రీను అమరలపూడి శ్రీను పొదిలి తిరుపయ్య జోనబోయిన వీరస్వామి బాబురావు ఎన్నుకోవడం జరిగింది ఈ సమావేశంలో సిపిఐ గ్రామ కార్యదర్శి ఆవుల మంగయ్య సహాయ కార్యదర్శి సుంకు కృష్ణారెడ్డి మండల నాయకులు అమర్లపూడి వెంకన్న పుల్లయ్య ఎస్.కె పాషా తదితరులు పాల్గొన్నారు.